సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



60 టీఎంసీలు దాటిన సోమశిల

సోమశిల: జలాశయం సోమవారానికి 60 టీఎంసీలు దాటింది. పైనుంచి 14,645 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 50, ఉత్తరకాలువకు 300, దక్షిణ కాలువకు 5, కండలేరుకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్ల (10 గ్రా)	రూ.80.530
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7.300
3 శాతం జీఎస్టీతో	రూ.7.519
సవర (8 గ్రా)	రూ.60.152

గరిష్టం/కనిష్టం
34.1 /25.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం తెల్లవారు జాము వరకు ఆకాశం మేఘావృతంగా ఉండి. ఆ తర్వాత వాతావరణం పొడిగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 76 శాతం ఉంది.

న్యూస్‌రీల్

'మాస్టార్' వలపు వలలో యువతి

- పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

కావలి: పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాయమాటల ప్రేమ వలపులో ఓ యువతి పడి పోయింది. అతన్నే పెళ్లి చేసుకొంటానని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని పురుగు మందు తాగిన ఘటన కావలి పట్టణంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఓ మున్సిపల్ స్కూల్లో ఆయన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అదే స్కూల్లో చిరు ఉద్యోగిగా నాలుగు నెలల క్రితం చేరిన యువతితో ప్రేమాయణం నడిపించాడు. ఆయన సతీమణి కూడా ఉపాధ్యాయురాలే కావడం గమనార్హం. ఇద్దరు పిల్లలు తండ్రి అయిన ఆ ఉపాధ్యాయుడు తన ప్రేమ వలపు మాయ మత్తులో యువతిని ముంచేశాడు. ఈ వ్యవహారాన్ని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేసేందుకు ఒక సంబంధాన్ని ఖరారు చేశా రు. మరో వారం రోజుల్లో ముహూర్తాలు పెట్టుకోవాల్సి ఉంది. దీంతో ఆ యువతి తాను వేరే పెళ్లి చేసుకోనని, ఉపాధ్యాయుడి భార్యను ఒప్పించి అతన్నే పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పింది. తల్లిదండ్రులు కూడా కఠినంగా ఉండడంతో వారి కళ్ల ముందే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానని పాల్పడింది. దీంతో యువతిని కావలిలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

రేపు ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ ఎన్నికలు

- తొలిసారి పోటాపోటీగా ప్రచారం

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా బుధవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న నర్సింగ్ కళాశాలలో జరగనున్నాయి. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ పెద్దాస్పత్రి తదితర చోట్ల పని చేస్తున్న రెగ్యులర్ నర్సులు ఓటేయనున్నారు. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగేవి. అయితే జిల్లాలో ఇప్పటి వరకు లేని విధంగా ఈ ఎన్నికల్లో రెండు ప్యానల్స్ తరఫున అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, కోశాధికారి పదవులతో పాటు ఈసీ మెంబర్లుగా ఒక్కో ప్యానల్ తరఫున 9 మంది పోటీ చేస్తున్నారు. వరలక్ష్మి ప్యానల్ ఒకటి కాగా సత్యవతి ప్యానల్ మరొకటి. ఆయా ప్యానల్స్ తరఫున పోటీ చేస్తున్న వారందరూ ప్రతి ఆస్పత్రిలో ఉన్న రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందిని ఓటు వేయాలని కోరుతూ ప్రచారం ముమ్మరం చేశారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్‌లు

నెల్లూరు సిటీ: నెల్లూరు డిపో–2 పరిధిలోని ముత్తుకూరు రూట్లో ప్రయాణికులను లక్కీ డ్రా ద్వారా ముగ్గురు ప్రయాణికులను ఎంపిక చేసినట్లు డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పేర్కొన్నారు. వారు ప్రయాణించే టికెట్ ద్వారా గిఫ్ట్ స్కీమ్ ప్రవేశ పెట్టామన్నారు. అందులో భాగంగా సోమవారం గిఫ్ట్ స్కీమ్ బాక్స్‌లను ఓపెన్ చేసి డిప్ తీశామన్నారు. మొదటి బహుమతి కె మోహన్‌బాబు, రెండో బహుమతి శ్రీజ, మూడో బహుమతి పీ జయప్రద విజేతలుగా నిలిచారన్నారు. గెలుపొందిన వారు ఆర్టీసీ ట్రాఫిక్ విభాగంలో సంప్రదించాలని కోరారు. గిఫ్ట్ స్కీమ్ అవకాశాన్ని ప్రయాణికులు ఉపయోగించుకుని డిపో–2 అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

శాస్త్రోక్తంగా తూర్పురాజగోపుర ద్వారబంధం ప్రతిష్ట



తూర్పురాజగోపుర ద్వారబంధం వద్ద పూజలు చేస్తున్న మన్నెమాల దంపతులు

బిట్రగుంట: కొండబిట్రగుంట బిలకూటక్షేత్రంలో తూర్పువైపు రాజగోపుర ద్వారబంధం ప్రతిష్టాపన వేడుకలను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆగమ పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో రాజగోపుర నిర్మాణదాతలు మన్నెమాల సుకుమార్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ద్వారబంధం ప్రతిష్టాపనను ప్రారంభించారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య రాజగోపురానికి ద్వారబంధాలు ప్రతిష్టించారు. నిర్మాణదాత మన్నెమాల సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.2కోట్ల వ్యయంతో తూర్పువైపున రాజగోపుర నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తన మిత్రుడు ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి రూ.50లక్షలు అందజేయగా, మిగిలిన నగదు తాను సొంతంగా వెచ్చిస్తున్నట్లు వివరించారు. బిలకూట క్షేత్రాన్ని భక్తులు, దాతలు, ప్రభుత్వ సహకారంతో సింహపురి తిరుమలగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గతంలోనే మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రసన్నుని ఆశీస్సులతో మాస్టర్ ప్లాన్ త్వరలోనే కార్యరూపందాల్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్యం షాపులకు పచ్చ మాఫియా పీడ



వాటాలు తేలకపోవడంతో దుకాణాల ఏర్పాటుపై తమ్ముళ్ల పేచీ

- జిల్లాలో ఇంకా ప్రారంభం కాని ఐదు షాపులు
- నెల్లూరులో షాపు ఏర్పాటును అడ్డుకుంటున్న షాడో మంత్రి
- కోవూరులో 20 శాతం వాటా ఇస్తేనే అనుమతి
- ఇష్టారాజ్యంగా జనావాసాల మధ్య దుకాణాలు
- అండగా ఉంటామని హామీ ఇచ్చి చేతులెత్తేసిన ఎక్సైజ్ శాఖ
- జనావాసాల మధ్య షాపులు తొలగించాలని ఉద్యమిస్తున్న మహిళలు

జిల్లాలో పచ్చ నేతలు వరల్డ్ మోస్ట్ 'మాఫియా' లీడర్లను మించిపోయారు. అత్యంత పవర్ ఫుల్ శాఖల్లో ఒకటైన 'ఎక్సైజ్ శాఖ'నే శాసిస్తున్నారు. సాధారణంగా మద్యం షాపు ఏర్పాటు చేయాలంటే ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలి. కానీ జిల్లాలో పచ్చ నేతల మాఫియా అనుమతి ఉంటేనే ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం తెచ్చిన ప్రైవేట్ మద్యం దుకాణాలను తొంభై శాతానికి పైగా టీడీపీ నేతలే దక్కించుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల హామీలను నమ్మి కొన్ని చోట్ల దుకాణాలను దక్కించుకున్న ఇతరులకు ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. స్థానిక టీడీపీ నేతల వాటాలు పొత్తు తేలకపోవడంతో దుకాణాల ఏర్పాటును అడ్డుకుంటున్నారు. మరో వైపు టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఊరూరా నిరసనలు, ఉద్యమాలు ఊపందుకున్నాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మీరూ మద్యం షాపులకు దరఖాస్తులు వేయండి.. షాపులు వస్తే నిర్వహించుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మేము అండగా ఉంటాము' అని చెప్పిన ఎక్సైజ్ అధికారులు ఇప్పుడు చేతులెత్తేశారు. ఏమి చేయలేక పోతున్నాం.. టీడీపీ నేతలు చెప్పినట్లు చేయమని ఉచిత సలహా ఇస్తున్నారు. 'మద్యం దుకాణాల్లో తలదూర్చదంటూ' సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు గాలి మాటలే అని తేలిపోయింది. జిల్లాలో మద్యం వ్యాపారాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు పచ్చనేతలు 'కరుడు గట్టిన మాఫియా'ను మించిపోయి చెలరేగిపోతున్నారు. మద్యం దుకాణాల్లో వాటాలు ఇవ్వాల్సిందేనంటూ బెదిరింపులు చేస్తూ షాపుల ఏర్పాటును అడ్డుకుంటున్నారు. మద్యం దుకాణాలకు ఏర్పాటు ప్రక్రియకు అనుమతులు ఇచ్చిన వారం రోజులు గడిచిపోయింది. కానీ ఇంకా జిల్లాలో పూర్తిస్థాయిలో ఎక్సైజ్ అధికారులు ప్రారంభించ లేకపోతున్నారు. వ్యాపారులు, పచ్చనేతల మధ్య వాటాలు తేలకపోవడంతో నెల్లూరు, కోవూరు, కావలి నియోజకవర్గాల్లో ఐదు దుకాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో దుకాణాలు దక్కించుకున్న యజమానులు లబోదిబోమంటున్నారు.

నెల్లూరులో షాడో మంత్రి బరితెగింపు

నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30 దుకాణాలను తమ్ముళ్లే చేజిక్కించుకున్నారు. మద్యం సిండికేట్ ఆధ్వర్యంలో షాపుల నిర్వహణ సాగుతున్నాయి. చాలా వరకు షాపుల్లో 20 శాతం వాటా స్థానిక ఎమ్మెల్యేలకు ఇచ్చేయడంతో ఏర్పాటు సాఫీగానే సాగింది. వాటాల్లో తేడాలొచ్చిన చోట గుడ్‌విల్ కింద షాపులు ఎమ్మెల్యే ముఖ్య అనుచరులకు అప్పగించి వెళ్లిపోయారు. నగరంలో బిజినెస్ బాగా జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటు చేయడానికి అదనంగా కప్పం కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. మంత్రి నారాయణ నియోజకవర్గంలో షాడో మంత్రిగా వ్యవహరిస్తున్న సదరు నేత మద్యం దుకాణాల ఏర్పాటు తన కనుసన్నల్లోనే జరిపిస్తున్నారు. షాపుల్లో వాటాలు లేదా గుడ్‌విల్ ఇవ్వాలని డిమాండ్లు పెట్టడంతో వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంత్రి కోటరీలో మూడు మద్యం దుకాణాలు రావడంతో సదరు షాడో మంత్రికి వాటా ఇవ్వలేదని సాకుతో షాపును పెట్టుకోనివ్వకుండా అడ్డుకుంటున్నాడు. ఎక్సైజ్‌శాఖ అధికారులపై లైసెన్స్ ఇవ్వొద్దని ఒత్తిడి తెస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో సదరు షాపు యజమాని సొంత భవనంలో దుకాణం ఏర్పాటు చేసుకోనివ్వకుండా అధికారులతో అడ్డుకుంటున్నాడు. కిసాన్ నగర్ ఏరియాలో దుకాణం ప్రారంభించినా తెలుగు మహిళలను పంపించి గొడవ చేయిస్తున్నాడు. షాడో మంత్రి వికృత విన్యాసాలతో మద్యం వ్యాపారులు బేజారవుతున్నారు.

కోవూరులో తెరుచుకోని మూడు దుకాణాలు

కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటరీలో కీలకంగా ఉన్న నెల్లూరురూరల్ నియోజకవర్గ నేతతో పాటు మరో నేత మద్యం షాపుల వద్ద దందాలు ప్రారంభించారు. తమ సిండికేట్‌కు కాకుండా ఇతరులకు దక్కిన షాపుల్లో 20 శాతం వాటా కట్టాల్సిందేనంటూ మంకుపట్టు పట్టి దుకాణాల ఏర్పాటును అడ్డుకుంటున్నారు. ఇలా కోవూరులో ఒకటి, ఇందుకూరుపేటలో రెండు షాపులు ఏర్పాటు చేయనివ్వలేదన్న ఆరోపణలున్నాయి. ఇందుకూరుపేట మండలంలో మొత్తం ఐదు షాపులు తమ్ముళ్లకే దక్కాయి. తమ్ముళ్లయినా వ్యాపారంలో వాటాలివ్వాల్సిందేనంటూ డిమాండ్ చేయడంతో ఈ వ్యవహారం ఇంకా తెగకపోవడంతో ఇప్పటికీ రెండు దుకాణాలను ఏర్పాటు చేయనివ్వలేదు. ఆయన ఎమ్మెల్యే కోటరీ వ్యక్తి కావడంతో మండలంలో ఆయన దందాలపై ఎవరూ ప్రశ్నించలేకపోతున్నారు. ఐదు షాపుల్లో ఇప్పటికే మూడు షాపులు దక్కించుకున్న సదరు నేత సిండికేట్ ఇతర వ్యాపారులను బెదిరింపులతో మరో షాపును చేజిక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరో దుకాణంలో వాటాలు తేలే వరకు లైసెన్స్ ఇవ్వద్దంటూ ఎక్సైజ్ శాఖకు ఆదేశాలివ్వడంతో అధికారులు ఏమీ చేయలేక మౌనంగా ఉండిపోయారు.

కావలిలో దుకాణాలపై ప్రజాప్రతినిధి ప్రైవేట్ సైన్యం దౌర్జన్యం

కావలి నియోజకవర్గంలో పచ్చనేతల దౌర్జన్యకాండకు అంతులేకుండా పోతోంది. మద్యం సిండికేట్లలో తమ్ముళ్లదే హవా కావడంతో దుకాణాల ఏర్పాటు కూడా వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి ఏకంగా ప్రైవేట్ సైన్యాన్ని పెంచిపోషిస్తూ మద్యం వ్యాపారులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా మద్యం షాపు ఏర్పాటు విషయంలో రౌడీ మూకలు వీరంగం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బిజినెస్ బాగా జరిగే ఏరియాలో షాపు ఏర్పాటు చేసుకోవాలంటే కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

సుప్రీంకోర్టు ఆదేశాలు ఉల్లంగించి హైవే పక్కనే దుకాణాలు

జిల్లాలో చాలా ప్రాంతాల్లో సుప్రీం కోర్టు ఆదేశాలు ఉల్లగించి హైవేలు, సర్వీస్ రోడ్లు, జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. షాడో మంత్రిగా వ్యవహరిస్తున్న సదరు నేత తన సొంత ప్రాంతం కొడవలూరు మండల పరిధిలో ఉన్న నేషనల్ హైవే 16 పక్కనే గండవరం రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేసి తమ్ముడా.. మజాకా అనిపించుకున్నాడు. హైవేకు 50 మీటర్ల దూరంలోనే ఈ దుకాణం ఏర్పాటు చేయడం గమనార్హం. దుకాణం వెనుకనే క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నడిచే పాఠశాల ఉంది. హైవేకు, పాఠశాలక పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేసినా ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- ➡ బుచ్చిరెడ్డిపాళెంలో నెల్లూరు–ముంబై 67వ నంబరు జాతీయ రహదారి పక్కనే పట్టణ నడిబొడ్డున మస్తాన్‌రావు హాస్పిటల్ పక్కన ఉత్తరం వైపు నారాయణ స్కూల్, దక్షిణ వైపు ఎలిమెంటరీ స్కూల్, పిండిబడి, ప్రైవేట్ హాస్పిటల్, పోలేరమ్మ చెట్టు మధ్యలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని తొలగించాలని వారం రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. స్థానిక మహిళలు దుకాణం ఎదుట బైఠాయించి ఫ్లెక్సీలను చించివేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిప్రతం అందజేశారు.
- ➡ తోటపల్లిగూడూరు మండలం నరుకూరు సెంటర్‌లో వేలాది మంది జనావాసాల మధ్య దుకాణం ఏర్పాటు చేశారు. దీన్ని తొలగించాలని సీపీఎం, ఐద్వా నేతలు, స్థానికులు ఆందోళన చేస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. శనివారం పెద్ద ఎత్తున మహిళలు ధర్నా నిర్వహించారు.
- ➡ అనుమసముద్రంపేట మండలం హసనాపురంలో మసీదు, బంగారమ్మ దేవర గుడి ఉండే ప్రాంతంలో మద్యం షాపునను చేశారు. దర్గాకు వెళ్లే స్థలాన్ని కొంత ఆక్రమించి మద్యం షాపును ఏర్పాటు చేశారని స్థానికులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.
- ➡ నెల్లూరు నగరంలోని జగదీష్‌నగర్ ఏడో వీధిలోని నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు.
- ➡ నగరంలోని మైపాడుగేట్ సెంటర్‌లో శ్రీనివాస నగర్ ప్రాంతంలో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. షాపు తొలగించాలంటూ ఆందోళనకు దిగారు.



నెల్లూరు జగదీష్‌నగర్‌లో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు



గండవరం రోడ్డులో చెన్నై–కోల్‌కతా హైవే పక్కనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఇస్కపాళెం పల్లిపాళెం వాసులు

దుకాణాల ఏర్పాటుకు సుప్రీం, కేంద్రం ఇచ్చిన ఆదేశాలివే..

జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంగించి ప్రధాన రహదారులు, గుడులు, బడులు, ఆస్పత్రుల పక్కనే దుకాణాలను ఏర్పాటు చేసిన పరిస్థితి వికటిస్తోంది. ఇప్పటికే అటువంటి షాపులను మరో చోట ఏర్పాటు చేసుకోవాలని మహిళలు, ప్రజాసంఘాలు ఉద్యమిస్తున్నాయి. 2017 ఏప్రిల్ 6వ తేదీన సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారులు, స్టేట్ హైవేస్, సర్వీస్ రోడ్లు, జనావాసాలకు 500 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఒక వేళ 20 వేల మంది జనాభా కంటే తక్కువ ఉంటే 220 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఇచ్చారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు



మద్యం షాపుల ఏర్పాటులో ఎక్సైజ్ అధికారులు, వ్యాపారులు నిబంధనలు ఉల్లగిస్తున్నారు. బుచ్చిరెడ్డి పాళెంలో ఆస్పత్రికి, దేవాలయానికి మధ్యలో ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాన్ని వెంటనే అక్కడి నుంచి తరలించాలని వారం రోజులుగా మొరపెట్టుకుంటున్నా.. ఆందోళన చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకే కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చాం.

– డాక్టర్ యూపి మస్తానయ్య, బుచ్చిరెడ్డిపాళెం

ఇబ్బందులు పడుతున్నాం



ఇళ్ల మధ్యలో మద్యం షాపును ఏర్పాటు చేశారు. నిత్యం మందుబాబులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గోడల మీద గ్లాసులు పెట్టి తాగుతూ బూతులు మాట్లాడుతున్నారు. గుడి, బడి ఉండే చోట మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలను కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించి షాపును ఎత్తివేయాలి.

– షేక్ ఖాజమ్మ, బుచ్చిరెడ్డిపాళెం

డీఎస్సీ ఉచిత శిక్షణ టెస్ట్ గడువు పొడిగింపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇచ్చేందుకు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్క్రీనింగ్ టెస్ట్ దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకు పెంచామని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్:// జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. సీనియారిటీ కలిగిన సంస్థలు ఎంపానెల్ చేసుకునేందుకు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఆసక్తి ఉన్న సంస్థలు ఎక్స్‌ప్రెసెస్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)ను ఏపీ ఈ–ప్రొక్యూర్‌మెంట్‌పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://టెండర్.ఏపీ ఈ ప్రొక్యూర్‌మెంట్.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పత్రికా స్వేచ్ఛపై అక్రమ కేసులు దారుణం


- ఏపీయూడబ్ల్యూజే నేతలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉండి పని చేసే పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం, దేశ భవిష్యత్‌కు గొడ్డలి పెట్టుగా మారుతుందని నెల్లూరు జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. 'సాక్షి' ఎడిటర్ వి. మురళిపై పెట్టిన కేసును వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఓ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వంలో, ప్రభుత్వ వ్యవస్థల్లో తప్పులు, అక్రమాలు, అవినీతి జరిగితే వార్తలు రాసే హక్కు పత్రికలకు ఉందని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే అందులో నిజం ఎంతో తెలుసుకోవాలే తప్ప, అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. ఒక వేళ తప్పుడు వార్తలు రాస్తే.. అందుకు సంబంధించి వివరణలు ఇవ్వడం, అవసరమైతే కోర్టుల్లో కేసులు వేసుకోవచ్చన్నారు. కానీ ఇలా తప్పుడు కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీం కోర్టుతో సహా వివిధ న్యాయ స్థానాలు పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించరాదని చెబుతున్నా.. కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమన్నారు. అధికారుల్లో మార్పు వచ్చినా, జర్నలిస్టులపై దాడులు కేసుల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. జర్నలిస్టులు రాసే వార్తలు ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉన్నాయనే కారణంతోనే క్రిమినల్ కేసులు పెట్టొద్దన్నారు. అధికార బలంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు ఉంటే అటువంటి వాటిని ఆదిలోనే ఆపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, కోశాధికారి గడ్డం హోసక్, ఉపాధ్యక్షులు దయాశంకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు టీ రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.


అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి



'సాక్షి' పత్రిక ఎడిటర్ మురళిపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించి నట్లే. చట్టవిరుద్ధమని తెలిసి కూడా అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి.

– జయప్రకాష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మీడియాపై దౌర్జన్యం తగదు



ప్రభుత్వం ప్రత్యేక విధానాలను ప్రచురిస్తున్న మీడియాలపై దౌర్జన్యం తగదు. తప్పుడు కథనాలు అయితే చర్యలు తీసుకునే విధానాలు వేరే ఉన్నాయని, కానీ కేసులు పెట్టడం చూస్తే వేధించే ఉద్దేశంగానే కనిపిస్తోంది. 'సాక్షి' ఎడిటర్ మురళిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాలను అవలంబించకుండా ప్రభుత్వం ఏకపక్ష వైఖరి విడనాడాలి.

– దయాశంకర్, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు



ఒంగోలులో గురువారం రాత్రి నర్సింగ్ కళాశాలలో చోరీకి పాల్పడిన చెడ్డీ గ్యాంగ్



ఈ ఏడాది ఫిబ్రవరిలో ముసునూరు దగ్గర స్కూల్లో చోరీకి పాల్పడిన చెడ్డీ గ్యాంగ్

వాళ్లూ.. వీళ్లూ ఒకటేనా!

- జిల్లా సరిహద్దుల్లో చెడ్డీ గ్యాంగ్ కదలికలు
- ప్రకాశం జిల్లాలో వరుస చోరీలకు పాల్పడిన గ్యాంగ్
- గతంలో జిల్లాలోనూ ఇదే తరహాలో చోరీ
- విద్య, వాణిజ్య సంస్థలే లక్ష్యంగా పంజా విసురుతున్న ముఠా

కావలి/ బిట్రగుంట: జిల్లా సరిహద్దుల్లో చెడ్డీ గ్యాంగ్ కదలికలు మళ్లీ కలకలం సృష్టిస్తున్నాయి. రైల్వేట్రాక్ సమీపంలోని విద్య, వాణిజ్య సంస్థలు, శివారు ప్రాంతాలే లక్ష్యంగా పంజా విసురుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముసునూరు సమీపంలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్లో చెడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడి సుమారు రూ.5లక్షల మేర చోరీ చేశారు. మొత్తం నలుగురు సభ్యులు కలిగిన ముఠా చోరీ చేసి హైవే మీదుగా పారిపోయారు. చెడ్డీ గ్యాంగ్ ముఠా గ్లౌజులు ధరించి వేలిముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పోలీసులు సీసీ పుటేజీ, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఫిబ్రవరిలో చెన్నైలో చోరీలకు పాల్పడి రాష్ట్రంలోకి ప్రవేశించిన ఈ గ్యాంగ్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని దర్యాప్తును వేగవంతం చేసినా నిందితులకు సంబంధించిన సమాచారం లభ్యం కాకపోవడం, ఆ తర్వాత ఎన్నికల హడావుడి కారణంగా దర్యాప్తు నిలిచిపోయింది. తాజాగా ఇదే గ్యాంగ్ ప్రకాశం జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం ఒంగోలు నగర శివార్లలోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో చోరీకి ప్రయత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి కేకలు వేయడంతో పారిపోయారు. అక్కడి నుంచి రైల్వేట్రాక్ మీదుగా నడుచుకుంటూ వెళ్లి రాంనగర్ ఎనిమిదో లైన్‌లోని నర్సింగ్ కాలేజీలోకి చోరీకి పాల్పడ్డారు. ఆఫీసులోని రూ.1.5 లక్షలు చోరీ చేశారు. ఇక్కడ నలుగురు సభ్యులతో కూడిన చెడ్డీ గ్యాంగ్ ముఠా చోరీకి పాల్పడినట్లు సీసీ పుటేజీలో రికార్డ్ అయింది.

ఈ రెండు గ్యాంగ్‌లు ఒక్కటేనా..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ముసునూరు సమీపంలోని ఇంటర్నేషనల్ స్కూల్లో, తాజాగా ఒంగోలు నగరంలో చోరీలకు పాల్పడింది ఒకే గ్యాంగ్ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ పుటేజీల్లో నిందితుల ఆనవాళ్లతో పాటు చోరీలకు పాల్పడిన విధానం కూడా దాదాపుగా ఒకేలా ఉంది. ఈ క్రమంలో ఈ ముఠా జిల్లాలో మళ్లీ పంజా విసిరే ప్రమాదం ఉంది.

కనిపించని పోలీసు నిఘా

నేర నియంత్రణలో పోలీసుశాఖ సాంకేతికతపై అతిగా ఆధారపడడం నేరస్తులకు వరంగా మారింది. నేరం జరిగిన తర్వాత సీసీ పుటేజీలు, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేపట్టే పోలీసులు నేరాలను ముందుగా అడ్డుకోవడంలో మాత్రం తీవ్రంగా విఫలమవుతున్నారు. విజిబుల్ పోలీసింగ్, నైట్ బీట్ వ్యవస్థను పక్కాగా అమలు చేయడం ద్వారా నేరాలను ముందుగానే అడ్డుకునే అవకాశం ఉన్నా పోలీసు యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించడం లేదు. పాతనేరస్తుల గుట్టుమట్లు విప్పడంలో ఫీల్డ్ ఇంటిలిజెన్స్‌గా పేరొందిన ఇన్‌ఫార్మర్ వ్యవస్థ కూడా పూర్తిగా కనుమరుగైంది. శివారు ప్రాంతాలు, నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉండే ఏరియాలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, తదితర ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ వ్యవస్థను మెరుగుపరచడం, నైట్ బీట్‌ను ముమ్మరం చేయడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలోనే అరికట్టే అవకాశం ఉంది.

క్లుప్తంగా

కండలేరులో పెరిగిన నీటి నిల్వలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 37.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయంలోకి వరద కాలువ నుంచి 350 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 9,500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్య సాయిగంగ కాలువకు 140, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ


దేశ్‌నాయక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జలవనరుల శాఖ జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈగా ఎస్.దేశ్‌నాయక్ నెల్లూరులోని రామలింగాపురం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. కాలువల మరమ్మతుల కోసం రూ.28.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో ఐఏబీ సమావేశం నిర్వహించి రైతులకు నీటిని అందజేసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతలకు మేలు చేసే విధంగా పనిచేస్తానని వివరించారు. ఏపీ ఎన్‌జీఓ ఇరిగేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, గీత, పెంచలయ్య, ఈఈ, డీఈలు, సిబ్బంది ఎస్ఈకి శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయంలో నగదు చోరీ?


ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

మర్రిపాడు: మండలంలోని నందవరం శివాలయం హుండీ కానుకలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. దొంగలు శివాలయం గేటు తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించిన ఆనవాళ్లున్నాయి. సోమవారం ఉదయం గ్రామస్తుల సమాచారంతో మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే చోరీ జరగలేదని నిర్ధారించారు. కాగా ఈ విషయంపై ఆలయ కమిటీ సభ్యులు స్పందించారు. ఫిబ్రవరిలో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనను ఐదురోజులపాటు, ఇటీవల దసరా ఉత్సవాలను నిర్వహించామన్నారు. హుండీ నిండిపోయి ఉందని, పెద్దల సమక్షంలో దానిని తెరిచి కానుకలను లెక్కించి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాలని భావించామన్నారు. దొంగలు హుండీని బయటకు తీసుకొచ్చి నగదు దోచుకున్నారని, కొంత మొత్తాన్ని మిగిల్చారని అంటున్నారు. సుమారు రూ.2 లక్షలు చోరీ చేసి ఉండొచ్చని చెబుతున్నారు.

ఫోన్ మాట్లాడుతూ వెళ్తుండగా..

- రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

నెల్లూరు(క్రైమ్): మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతుండగా ప్రమాదశాత్తు రైలు ఢీకొని విశ్రాంత అటవీశాఖ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు కొండాయపాళెం గేటు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బీవీ నగర్‌లో అటవీశాఖ విశ్రాంత ఉద్యోగి ప్రసాద్ (62) నివాసం ఉంటున్నాడు. ఆయన సోమవారం జీజీహెచ్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పనులు చూసుకుని ఇంటికి బయలుదేరాడు. ఫోన్‌లో మాట్లాడుకుంటూ కొండాయపాళెం రైల్వే గేటు దాటుతుండగా చెన్నై వైపు వెళ్తున్న రైలు వేగంగా ఢీకొంది. దీంతో ప్రసాద్ మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి భార్య జెస్సిబా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


'నా కుమారుడు కనిపించడం లేదు'

- పోలీసులకు తల్లి ఫిర్యాదు

ఉదయగిరి: తన కుమారుడు దశరథ్ కనిపించడం లేదని మండలంలోని దుర్గంపల్లికి చెందిన రాజేశ్వరి అనే మహిళ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి కథనం మేరకు.. రాజేశ్వరి ఉదయగిరిలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్తూ కుమారుడు దశరథ్‌ను దుకాణంలో ఉంచింది. ఆమె భోజనం చేసి తిరిగి రాగా కుమారుడితోపాటు దుకాణంలో ఉంచిన రూ.9 వేల నగదు కనిపించలేదు. దశరథ్ ఆచూకీ విషయమై తెలిసిన వారిని, బంధువులను విచారించగా ఫలితం లేకపోవడంతో పోలీసుల్ని ఆశ్రయించింది.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.70
సన్నవి : రూ.40
పండ్లు : రూ.25



అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుద్దాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నెల్లూరులో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం


నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, పోలీసులు

నెల్లూరు(క్రైమ్): 'సరిహద్దుల్లో దేశమాత రక్షణలో, సమాజంలో అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను బలిదానం చేసిన అమరవీరుల త్యాగాలు అజరామరం. వారి కుటుంబాలకు అండగా నిలుద్దాం' అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరులోని కవాతు మైదానంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం జరిగింది. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ సమాజంలో నక్సలిజాన్ని అంతమొందించేందుకు పోలీసులు ఎంతో కృషిచేశారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా వల్ల యువత భవిష్యత్‌ను పాడు చేసుకుంటోందని దీనిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ ఎంపికల్లో త్రుటిలో తప్పిపోయిన వారికి దేవదాయ శాఖలో సెక్యూరిటీ గార్డుగా తీసుకుంటామన్నారు.

స్ఫూర్తిదాయకం

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ సమాజ రక్షణకై పోరాడుతున్న పోలీసుల కృషి స్ఫూర్తిదాయకమని, వారు ఎల్లప్పుడూ ప్రజల మనసుల్లో నిలిచి ఉంటారన్నారు. కలెక్టర్ ఒ.ఆనంద్ మాట్లాడుతూ గతేడాది విధి నిర్వహణలో ప్రాణాలొదిలిన పోలీసు సిబ్బందికి నివాళులర్పిస్తున్నామన్నారు. అమరుల కుటుంబాలను ఆదుకునేందుకు, అవసరమైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సమాజంలో మెరుగైన శాంతిభద్రతలను ప్రజలకందించడమే అమరులకిచ్చే నిజమైన నివాళి అన్నారు. జిల్లాలో ఈ ఏడాది 12 మంది విధి నిర్వహణలో మృతిచెందారని, వారికి ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు వచ్చేలా చూస్తామన్నారు. తొలుత మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్ స్రవంతి, కలెక్టర్, ఎస్పీ, జేసీ కార్తీక్, నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి, ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏపీ పోలీసు అధికారుల సంఘ నాయకులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. పరేడ్‌ను పోలీసులు నిర్వహించారు. అమరుల కుటుంబాలకు వెల్ఫేర్ ఫండ్, హ్యూమానిటీ కార్పస్ ఫండ్ చెక్కులు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అమరవీరుల సంస్మరణ ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఇది ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది.


బాధిత కుటుంబాలతో మంత్రి, కలెక్టర్, ఎస్పీ తదితరులు


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

పోటెత్తి.. వినతులు అందించి..


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

- వివిధ సమస్యలపై 375 అర్జీలు
- గురుకులంలో సమస్యలపై ఫిర్యాదు
- మద్యం షాపును తొలగించాలని కోరిన జనం

నెల్లూరు(దర్గామిట్ట): 'మండలాల్లో అర్జీలు ఇస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలి' అని ప్రజలు ఉన్నతాధికారులను కోరారు. కలెక్టర్ ఆనంద్ నేతృత్వంలో సోమవారం నెల్లూరు కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి ప్రజలు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి 375 మంది విచ్చేసి అర్జీలు అందజేశారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో లవన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు వినతిపత్రాలు స్వీకరించారు.

పాపం దివ్యాంగులు


ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున దివ్యాంగులు వస్తున్నారు. వారు అర్జీలు రాయించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్

పరిష్కరించండి

- కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై యానాది సంక్షేమ సంఘం ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. లైట్లు, ఫ్యాన్లు లేవని, తాగునీటి సమస్య ఉందని, భోజనం బాగోలేదని పేర్కొన్నారు. గిరిజన పిల్లలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు
- సైదాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ హాస్పిటల్ సమీపాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల పక్కన ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.
- నెల్లూరు పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో రూ.5 కోట్లతో నిర్మించిన గోషా హాస్పిటల్ తక్షణమే ప్రారంభించాలని ముస్లింలు కోరారు. నిర్మాణం పూర్తయిన ఈ హాస్పిటల్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో తీవ్ర జాప్యం నెలకొందని వారు అన్నారు.
- జిల్లా అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు మురళీకృష్ణ యాదవ్ జేసీని కోరారు. నూతన కమిటీని ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా అప్పటి నుంచి కనీసం ఒక్క సమావేశం కూడా పెట్టలేదన్నారు. నిబంధనల మేరకు నెలకోసారి సమావేశం జరపాల్సి ఉందన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

విడవలూరు: మద్యం మత్తులో ఒకతను పానీపూరి బండి పెట్టుకున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. విడవలూరు గ్రామానికి చెందిన సోంపల్లి మురళి, ఆయన భార్య రత్నమ్మ స్థానిక అంకమ్మ గుడి సెంటర్‌లో పది సంవత్సరాలుగా పానీపూరి విక్రయిస్తున్నారు. సోమవారం సాయంత్రం వారి వద్దకు గ్రామానికి చెందిన మడపర్తి వంశీ అనే వ్యక్తి వచ్చి గోబీ మంచూరియా కావాలని అడిగాడు. ఇప్పుడే వచ్చాం కొంచెం లేటవుతుందని మురళి చెప్పాడు. నాకే లేటవుతుందని చెప్తావా? అంటూ వంశీ మద్యం మత్తులో పానీపూరీ బండి అద్దాలు పగులగొట్టాడు. అంతటితో ఆగకుండా మురళీని కొట్టడం మొదలుపెట్టాడు. బాధితుడు భయంతో పరుగులు తీసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

మోసం చేశారు.. చర్యలు తీసుకోండి


బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌజన్య

- పోలీసులకు వినతులు అందించిన ప్రజలు

నెల్లూరు(క్రైమ్): 'విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని లక్షలు తీసుకుని మోసగించాడు. సన్నిహితంగా ఉండే ఫొటోలతో క్లాస్‌మేట్ బెదిరిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. తక్కువ ధరకే ఇంటి స్థలాలు ఇప్పిస్తానని నగదు కాజేశారు. ఆస్తి కోసం అత్తింటివారు వేధిస్తున్నారు' ఇలా ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ. వారి సమస్యలను తీర్చాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 91 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె చట్టపరిధిలో వాటిని పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- సాయిలక్ష్మి అనే మహిళ నా భర్తకు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5.30 లక్షలు తీసుకుంది. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తోంది. విచారించి న్యాయం చేయాలని నెల్లూరు వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ వినతిపత్రం ఇచ్చారు.
- ఇంటర్ స్నేహితుడు శ్యామ్‌తో నేను సన్నిహితంగా ఉన్నప్పుడు ఫొటోలు తీశాడు. వాటిని నా కుటుంబసభ్యులకు పంపడమే కాకుండా, సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని వరికుంటపాడుకు చెందిన ఓ యువతి ఫిర్యాదు చేశారు.
- ఆర్టీసీ సెక్యూరిటీ గార్డు వరప్రసాద్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బిట్రగుంటకు చెందిన ఓ మహిళ, వంశీకృష్ణ అనే వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు కులవివక్ష చూపుతున్నాడని విచారించి న్యాయం చేయాలని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఏఎస్పీకి ఫిర్యాదులు చేశారు.
- మధు అనే వ్యక్తి తక్కువ ధరకే ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని తన వద్ద, మరికొందరి వద్ద రూ.8 లక్షలు తీసుకుని మోసగించాడని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ వాపోయారు.
- భర్త చనిపోవడంతో అత్తింటివారు ఆస్తి కోసం చిత్రహింసలు పెడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని గుడ్లూరుకు చెందిన ఓ మహిళ కోరారు.
- తమ 17 ఏళ్ల కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని, విచారించి న్యాయం చేయాలని దగదర్తికి చెందిన తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

డాక్టర్లు సమయపాలన పాటించాలి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో పనిచేసే డాక్టర్లందరూ సమయపాలన పాటించాలని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు అన్నారు. సోమవారం నగరంలోని కళాశాలలో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డాక్టర్ ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ఎక్కువగా సెలవులు పెట్టొద్దని సూచించారు. రోగులకు ఇబ్బంది లేకుండా సీనియర్ డాక్టర్లు ఓపీల్లో పూర్తి సమయం ఉండాలని కోరారు. త్వరలోనే ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) కమిటీ వస్తుందని, ఈలోపు డాక్టర్లు తమ విభాగాల పరిధిలో రోగులకు అందిస్తున్న సేవలు, ఆపరేషన్లు, ఇతర సర్వీసుల గురించి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఓపీ పెరిగితే అదనంగా పీజీ సీట్లు వస్తాయన్నారు.

పంచాయతీ ఈఓ చిల్లర రాజకీయాలు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ ఈఓ, వార్డు సభ్యులకు మధ్య నెలకొన్న వివాదం చినికి చినికి గాలివానగా మారుతోంది. ఈఓ టీడీపీ ట్రాప్‌లో పడి రాజకీయాలు చేస్తున్నాడు. పంచాయతీ కార్యాలయంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోల విషయమై రాజకీయ వివాదం నెలకొంది. ఈఓ ఆ ఫొటోలు తొలగించడాన్ని కొందరు వార్డు సభ్యులు అడ్డుకున్నారు. దీంతో తన విధులకు ఆటంకం కలిగించారంటూ సభ్యులపై ఈఓ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తప్పుడు ఫిర్యాదని సభ్యులు కలెక్టర్‌ను ఆశ్రయించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ నయీం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సమయంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు తదితరుల వాంగ్మూలాలు నమోదు చేశారు.

అధికారుల బహిరంగ విచారణ పూర్తయిన తర్వాత ఈఓ పంచాయతీ సిబ్బందితో బలవంతంగా తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారనే విషయం సోమవారం వెలుగు చూసింది. తనకు అనుకూలంగా వారితో అధికారులకు ఫిర్యాదు చేయించేందుకు ఈఓ వీధి బాగోతానికి తెరతీశారంటూ వార్డు సభ్యులు మండిపడుతున్నారు. ఈఓ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకే పంచాయతీ సిబ్బంది సంతకాలు తెల్లకాగితాలపై చేయించుకుని వివాదాస్పదంగా వ్యవహరించడం సరికాదని పంచాయతీ ప్రజలు కూడా మండిపడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను 'సాక్షి' సంప్రదించేందుకు ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ప్రాంతం

సోమశిల: అనంతసాగరం చెరువు కట్ట కింద భాగంలో గుప్త నిధుల కోసం తవ్విన ఘటన సోమవారం వెలుగు చూసింది. గతంలో ఈ ప్రదేశంలో రెండుసార్లు తవ్వకాలు చేపట్టగా ప్రజలు గుర్తించి ఆపేశారు. ఆ స్థలంలో దేవుడి విగ్రహం కూడా బయటపడిందని చెబుతున్నారు. పోలీసులు విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 132
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 262
లేయర్ చికెన్	: 195